# నేరం!

పేట పేట జనమంతా సుబ్బలక్ష్మి ఇంటి ముందు గుమిగూడిపోయారు. సుబ్బలక్ష్మి యింటిముందు ఒక పోలీసువ్యాను, జీపు నిలబడిఉన్నాయి. సబ్ఇనస్పెక్టర్లు, పోలీసులు ఊ( తెగ అటూ ఇటూ తిరుగుతున్నారు.

సుబ్బలక్ష్మిని పోలీసులు అరెస్టుచేశారు!!

అందరికీ ఈ విషయం ఆశ్చర్యం కలిగించింది. సుబ్బలక్ష్మిని ఎందుకు అరెస్టు చేశారు?...ఆమె ఇంట్లో బ్లాక్‌మనీ ఏమైనా దొరికిందా?... లేకపోతే దొంగతనం కేసా?...

వ్యభిచారంకేసా?... ఆమె అటువంటిది కాదే!!...ఎంతబుర్రబద్దలుకొట్టుకున్నా అసలు విషయం ఎవ్వరికీ అర్థంకాలేదు.

సుబ్బలక్ష్మి చేతికి బేడీలతో సబ్ఇనస్పెక్టరు వెనకాల ఇంటిబయటకువచ్చింది. ఆమె చేతి బేడీలుచూసి అందరూ హాహాకారాలుచేశారు.

"ఈమెచేసిన నేరం ఏమిటి సార్?"
ఎవరో అడిగారు సబ్ఇనస్పెక్టరును.
"చాల పెద్దనేరంలే..."సమాధానం
"ఈమె చాల మంచిదేనే?!..."
"నీకేం తెల్సు...హు..."

"అయితే ఈమెచేసిన నేరం ఏమిటిసార్?"
మళ్ళీ అదే పాట.

"చెప్పానుగా...చాల పెద్దనేరమని?"
మళ్ళీ అదే సమాధానం
"ఇంట్లో ఏమైనా బ్లాక్‌మనీ దొరికిందా?"
"ఊహు...పెద్ద నేరం!"

"కొంపతీసి వ్యభిచార కేసుగానీ కాదు కదా?" రహస్యంగా అడిగాడు. ఒకవేళ ఇనస్పెక్టరుఅవునని సమాధానంచెప్తే అతగాడు తప్పకుండా బాధపడిపోతాడు – ఇన్నాళ్ళా ఇంటిప్రక్కనే ఉన్నా తెలీక అవకాశంవదులుకున్నందుకు.

"చెప్పానుకదా?...చాల పెద్దనేరమని?"
"ఆ మధ్య వాళ్ళాయనచస్తే ఆత్మహత్యని అన్నారు...ఇప్పుడాకేసు హత్యకేసుగామారి ఈమెగానీ హంతకురాలిగా నిరూపింపబడలేదు కదా?..."

"ఎన్నిసార్లు చెప్పాలయ్యా ... పెద్దనేరమనీ?" ఇనస్పెక్టరు విసుక్కున్నాడు.
"కనీసం ఈమె విప్లవకవిత్వమన్నా రాయదే?...మరెందుకరెస్టుచేశారో?" ఇనస్పెక్టరు విసుగుదల లెక్కచెయ్యకుండా ఎవరో మళ్ళీ ప్రశ్నించారు.
"కవిత్వమైనా పరవాలేదయ్యా ... ఒక రెండు పేజీల్లో ఒక్కోపీసూ రాయొచ్చు... కానీ ఈమె వర్సబెట్టి నవలవ్రాస్తుంది...అదీ ఒక్కొక్కటీ అయిదారొందలపేజీలవి!...దేశం అంతటా పేపరు కరువిలా పేదవాడిడొక్కలా మండిపోతుంటే ఈవిడిలా సినిమాటిక్ నవలలు రాసి కాగితాలు దుర్వినియోగంచెయ్యడం ఎంత పెద్దనేరం?!!" అంటూ పోలీసువ్యాను వైపు అడుగులువేశాడు ఇనస్పెక్టరు.
రచయిత్రి సుబ్బలక్ష్మి తలవంచుకుని అతన్ని అనుసరించింది.
(ఎవర్నీ ఉద్దేశించింది కాదు.
కేవలం హాస్యం)

● మల్లిక్